క్లుప్తంగా

ఐఎంఏకు విరాళం



తెనాలి రూరల్: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ తెనాలి శాఖకు డాక్టర్ సీఎస్ఆర్‌కే ప్రసాద్ రూ. 5.40 లక్షలను అందించారు. ఈ మేరకు చెక్కును అసోసియేషన్ అధ్యక్షురాలు డాక్టర్ విజయలక్ష్మి, కార్యదర్శి డాక్టర్ పావని ప్రియాంక, కోశాధికారి డాక్టర్ శ్యామ్‌ప్రసాద్, ఉపాధ్యక్షుడు డాక్టర్ అనిల్‌కుమార్‌లకు గురువారం ఆయన అందజేశారు. ఏటా ఒక్కో వైద్య నిపుణుడితో తెనాలిలోని వైద్యులకు శిక్షణ, ఉపన్యాసం ఇప్పించి ఆయనకు బంగారు పతకం అందించాలని డాక్టర్ సీఎస్ఆర్‌కే ప్రసాద్ కోరారు. తమ వివాహ దినోత్సవం సందర్భంగా విరాళాన్ని అందించినట్టు తెలిపారు.

రేపు హనుమాన్ శోభాయాత్ర బైక్ ర్యాలీ

తెనాలి: ఒకటో తేదీన తెనాలిలో తలపెట్టిన శ్రీ హనుమాన్ శోభాయాత్ర బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని వర్ధమాన సినీ హీరో అభిషిక్ కోరారు. ఉప్పుబజారులో గురువారం ఉదయం కమిటీ సభ్యులతో కలిసి శోభాయాత్ర వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. అభిషిక్ మాట్లాడుతూ జూన్ ఒకటో తేదీ శనివారం హనుమాన్ జయంతి సందర్భంగా సాయంత్రం నాలుగు గంటలకు సుల్తానాబాద్‌లోని ఆంజనేయస్వామి దేవాలయం నుంచి బోస్ రోడ్డు చిట్టి ఆంజనేయస్వామి గుడి వరకూ హనుమాన్ శోభాయాత్ర బైక్ ర్యాలీ సాగుతుందని తెలిపారు. భక్తులంతా పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పాటిబండ్ల రామకృష్ణ, కొల్లా గురునాథ్ గుప్త, వేమా సురేష్ బాబు, సాంబశివరావు, గాదె హనుమారెడ్డి , కనమర్లపూడి సుబ్రహ్మణ్యం, కె. యశ్వంత్ పాల్గొన్నారు.

క్రీడాకారులకు పౌష్టికాహారం, దుస్తుల పంపిణీ

తెనాలి: స్థానిక అమరావతి కాలనీలోని అన్నాబత్తుని సత్యనారాయణ ఇండోర్ స్టేడియంలో శిక్షణ పొందుతున్న క్రీడాకారులకు రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం ఆధ్వర్యంలో పౌష్టికాహారం, దుప్పట్లు, టవల్స్ పంపిణీ చేశారు. తెనాలి స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ క్రీడా దుస్తులను అందజేసింది. స్టేడియంలో గురువారం సాయంత్రం ఏర్పాటైన సమావేశంలో స్టేడియంలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో నడుస్తున్న హ్యాండ్‌బాల్ అకాడమీలో శిక్షణ పొందుతున్న 20 మంది క్రీడాకారులకు వీటిని అందజేశారు. రోటరీ క్లబ్ సభ్యులు ఈదర వెంకట పూర్ణచంద్, చేతన్ రాజ్ కొఠారి, గుత్తా వెంకటరత్నం, ఆలపాటి కిరణ్, బత్తుల వెంకటేశ్వరరావు, కోచ్ నాగరాజు, వినయ్‌కుమార్, కిశోర్ పాల్గొన్నారు.

దర్శకరత్న దాసరికి నివాళి



తెనాలి: దర్శకరత్న దాసరి నారాయణరావు వర్ధంతిని గురువారం స్థానిక గాంధీనగర్‌లోని ఇస్కఫ్ కార్యాలయంలో నిర్వహించారు. అభ్యుదయ కళాసమితి ఆధ్వర్యంలో జరిగిన వర్ధంతి సభకు తెనాలి సాంస్కృతిక సంస్థ నిర్వాహకుడు బెల్లంకొండ వెంకట్ అధ్యక్షత వహించారు. రచయిత, విమర్శకుడు రంగిశెట్టి రమేష్ మాట్లాడుతూ, నటుడు, రచయిత, నిర్మాత, గీత రచయితగా సినీపరిశ్రమలో బహుముఖ బాధ్యతల్ని దాసరి నిర్వహించారని చెప్పారు. దాసరి జీవిత విశేషాల్ని వెంకట్ తెలియజేశారు. ప్రజానాట్యమండలి తెనాలి కార్యదర్శి దేవరపల్లి నీలాంబరం, ఎం.వి. రఘునాథరావు, సంగీత కళాకారులు చినబాజి, మురళి, కన్నెగంటి మధు, శ్యాంకుమార్, అన్నమాచార్య ప్రాజెక్టు గాయని వీణ, షేక్ బాజి, రాధాకృష్ణ, బొల్లిముంత కృష్ణ పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



తెనాలిరూరల్: తెనాలి–విజయవాడ రహదారి వెంబడి వీఎస్సార్ కళాశాల సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది ఉండడాన్ని పోలీసులు గురువారం గుర్తించారు. కళాశాల సమీపంలోని వినాయకుడి విగ్రహం వద్ద మృతదేహం ఉంది. వయసు సుమారు 65 ఉంటుంది. అనారోగ్య సమస్యలతో బాధపడుతూ మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. మృతదేహాన్ని తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు త్రీ టౌన్ ఎస్ఐ ప్రకాశ్ తెలిపారు.

మళ్లీ వైఎస్సార్ సీపీకే అధికారం

ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



చర్చిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: అన్ని వర్గాల ప్రజలకు మేలుచేసే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రానుందని ఆ పార్టీ తెనాలి అసెంబ్లీ అభ్యర్థి, ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. పట్టణ 14వ వార్డులోని చినరావూరులో గల సెయింట్ పాల్స్ లూథర్ దేవాలయంలో నిర్మించిన అదనపు హాలు ప్రారంభోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన శివకుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక కలిసి ఆయా నిర్మాణాల్ని ప్రారంభించారు. ఇక్కడ ఎంతో ప్రసిద్ధి చెందిన సెయింట్ పాల్స్ లూథర్ దేవాలయం అనుబంధ నిర్మాణాలు శోభాయమానంగా ఉన్నాయని చెప్పారు. భగవంతుని ఆశీస్సులు అందరిపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. సంఘస్తుల కోరిక మేరకు చర్చికి స్థలం కేటాయించామని, అనుకున్నదానికంటే విస్తరణ బాగా జరిగిందని ప్రశంసించారు. మరికొద్ది రోజుల్లో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వస్తుందని తెలిపారు. చర్చికి, సంఘానికి తనవంతు సహాయసహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని చెప్పారు. తొలుత అన్నాబత్తుని శివకుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, 14వ వార్డు కౌన్సిలర్ దాసరి వీరవసంతరావు తదితరులకు సంఘస్తులు ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో నీలం సువర్ణ రాజు, మన్నవ రమేష్, కె.రత్నమోహన్, మన్నవ ప్రభాకర్, కన్నెగంటి రమేష్, దాసరి అనిల్, రాజారత్నం, కిరణ్, చర్చి కమిటీ, యూత్ స్త్రీల సంఘం బాధ్యులు పాల్గొన్నారు.

తేలప్రోలులో కార్డన్ సెర్చ్



తేలప్రోలులో గ్రామస్తులతో మాట్లాడుతున్న పోలీసులు



యువకులకు సూచనలిస్తున్న సీఐ దశరథరామారావు

37 బైక్‌లు, రెండు ఆటోలు స్వాధీనం

తెనాలి రూరల్: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ తేదీ దగ్గరపడుతున్న నేపథ్యంలో ఘర్షణలు, ఇబ్బందికర పరిస్థితులు తలెత్తకుండా పోలీసులు ముందస్తు జాగ్రత్త చర్యలు చేపడుతున్నారు. తెనాలి మండలం తేలప్రోలులో గురువారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. రూరల్ సీఐ టి. వెంకటేశ్వర్లు, త్రీ టౌన్ సీఐ ఎస్. రమేష్‌బాబు, వన్‌టౌన్ సీఐ జి. దశరథరామారావు, టూ టౌన్ సీఐ ఎ. సుధాకర్, రూరల్ ఎస్ఐ పి. కోటేశ్వరరావు, కొల్లిపర ఎస్ఐ రవీంద్రరెడ్డితో పాటు దాదాపు 70 మంది సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. గ్రామంలోని నివాసాలతో పాటు వాహనాలను ముమ్మరంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పత్రాలను లేని 37 బైక్‌లు, రెండు ఆటోలను సీజ్ చేశారు.

కేసుల్లో ఇరుక్కుంటే జీవితాలు నాశనం

తెనాలి రూరల్: కేసుల్లో ఇరుక్కుని జీవితాల్ని నాశనం చేసుకోవద్దని యువకులకు వన్‌టౌన్ సీఐ జి. దశరథరామారావు సూచించారు. తెనాలి గురవయ్య కాలనీ, చినరావూరు తోట, డిపో సెంటరులో వన్‌టౌన్ పోలీసులు గురువారం రూట్ మార్చ్ నిర్వహించారు. అనంతరం రామలింగేశ్వరపేటలోని పాత ఆర్టీసీ డిపో వద్ద యువకులతో సీఐ మాట్లాడారు. రాజకీయ పార్టీల నాయకులు, సినిమా హీరోలపై యువతకు అభిమానం ఉంటుందని, దాన్ని హద్దులు దాటనీయకూడదని సూచించారు.

పంట కాల్వల మరమ్మతులు వెంటనే చేపట్టాలి

తెనాలి: పంట, మురుగు కాల్వల మరమ్మతులను ప్రభుత్వం సత్వరమే చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి కోరారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావుతో కలిసి ఫీడర్ చానల్, దాని పరిధిలోని ఇతర కాల్వల్ని గురువారం ఆయన పరిశీలించారు. పట్టణ అయితానగర్, రూరల్ మండల గ్రామాలైన కంచర్లపాలెం, సోమసుందరపాలెం, తేలప్రోలు, నేలపాడు, కొల్లిపర మండల గ్రామం అత్తోటకు చెందిన మొత్తం ఆరు వేల ఎకరాల భూములకు సాగునీరందించే పంట కాల్వలకు మరమ్మతులు చేపట్టాలని కోరారు.

మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలి

ఉపాధి హామీ కూలీలకు మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం గుంటూరు జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివసాంబిరెడ్డి డిమాండ్ చేశారు. తెనాలి రూరల్ మండలం తేలప్రోలులో గురువారం ఉపాధి పనుల్ని వారు పరిశీలించారు. కూలీల సమస్యల్ని అడిగి తెలుసుకున్నారు.

చిట్టి ఆంజనేయస్వామికి శత వసంతాలు

రేపటి నుంచి శత జయంతి మహోత్సవాలు
- మూడు రోజుల పాటు విశేష పూజలు
- సాంస్కృతిక కార్యక్రమాలు



శ్రీ చిట్టి ఆంజనేయస్వామి ఆలయం



శ్రీ చిట్టి ఆంజనేయస్వామి

తెనాలి: ఆంధ్రా ప్యారిస్ తెనాలి, పరిసరాల్లో పౌరాణిక, చారిత్రక ప్రాశస్త్యం కలిగిన పలు దేవాలయాలు భక్తుల పూజల్ని అందుకుంటున్నాయి. వీటిల్లో పట్టణంలో గల చిట్టి ఆంజనేయస్వామి దేవాలయం ప్రముఖమైంది. కోర్కెలు తీరుస్తున్న ఆలయంగా భక్తుల సేవలను అందుకుంటోంది. విగ్రహ ప్రతిష్ఠ జరిగిన జూన్ 5వ తేదీన ఆలయ శత జయంతి. జూన్ ఒకటి నుంచి మూడో తేదీ వరకు ఉత్సవాల్ని ఘనంగా నిర్వహించనున్నారు.

స్వప్నంలో హనుమ సాక్షాత్కారం

స్థానిక బోసురోడ్డులోని హనుమాన్ చౌక్‌లో గల దేవాలయం ఉన్న ప్రదేశంలో పూర్వం ప్రభల వేంకటసుబ్బయ్య అనే భాగవతోత్తముడు నివసించేవారు. వృత్తిరీత్యా సర్వేయరు. ప్రవృత్తిరీత్యా పరమ భాగవతోత్తముడు. తంబూరా మీటుతూ రాగనామ గానం చేస్తూ శ్రీరాముడు ప్రచారం చేసేవారు. అప్పట్లో ఈ ప్రాంతం పట్టణ పొలిమేర. అనుశ్రుతంగా వస్తున్న కథనం ప్రకారం ఒకరోజు వేంకటసుబ్బయ్యకు స్వప్నంలో హనుమ సాక్షాత్కారం జరిగింది. అలాగే కొన్నిరోజులు వరుసగా స్వామి దర్శనమివ్వసాగారు. దీనిని భగవదాజ్ఞగా భావించిన ఆయన, మరికొందరు గ్రామస్తులు కలిసి, తన ఇంటికి దగ్గర్లోని రోడ్డుపక్కగా గల అశ్వద్ధ వృక్షం (రావి చెట్టు)కింద ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠకు పూనుకున్నారు. శ్రీచిత్రభాను నామ సంవత్సరం వైశాఖ బహుళ దశమి రోజున అంటే 1924 జూన్ అయిదో తేదీన బెల్లంకొండ స్వామీజీ అనే దిగంబర అవధూతచే తాంత్రిక విధానంలో ఆంజనేయుడి విగ్రహాన్ని ప్రతిష్ఠింపజేశారు. స్వామి కేవలం అడుగున్నర ప్రమాణంలో 'చిట్టి' రూపంలో ఉన్నందున క్రమంగా చిట్టి ఆంజనేయస్వామిగా భక్తులు పిలుచుకోవడం ఆరంభించారు. 1932లో ప్రభల వేంకటసుబ్బయ్య, ఆలయం ఎదురుగా చలువ పందిళ్లు వేసి శ్రీసీతారాముల కళ్యాణం ఉత్సవాలను ప్రారంభించారు. ఉగాది రోజున అంకురార్పణ చేసి, నవమి వరకు రోజూ హరికథలు, సంగీత నృత్యక ళాంశాలు, పురాణ ప్రవచనాలు ఏర్పాటు చేసి, నవమిరోజున వైభవంగా కళ్యాణం జరిపించారు. భక్తుల ఆదరణ పొందటంతో ఏటా కొనసాగించారు. చల్లపల్లి జమీందారు కుటుంబీకులు చాలాకాలం ఈ కళ్యాణానికి కానుకలు పంపారు.

భక్తుల సహకారంతో ఆలయ అభివృద్ధి

1975లో అర్చకస్వామిగా వచ్చిన దీవి సీతారామాచార్యులు నేతృత్వంలో ఈ ఆలయం మరో శకంలోకి అడుగిడింది. భక్తుల సహకారంతో మందిరానికి శ్లాబు, పిట్టగోడలు, దశావతారాలు, ఇతర దేవీ దేవతా బొమ్మ కట్టుబడి, మందిరం లోపల ఫ్లోరింగ్, విద్యుద్దీకరణ చేయించారు. తర్వాత కాలంలో చిట్టి ఆంజనేయస్వామి ఆలయం పక్కనే శ్రీసీతారామమందిరం ఏర్పాటైంది. పక్కనే గల గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ సిబ్బంది, అక్కపెద్ది బాలగోపాల్ నేతృత్వంలో శ్రీసీతారామ మందిర నిర్మాణ కమిటీ ఆధ్వర్యంలో సీతాలక్ష్మణ హనుమత్సమేత శ్రీరామచంద్రమూర్తి ఆలయం ప్రతిష్ఠ 1975 జనవరి 8న చివుకుల వేంకట పూర్ణానందశాస్త్రి దంపతులచే నిర్వహించారు. అప్పట్నుంచి చిట్టి ఆంజనేయస్వామి గుడి వద్ద జరిగే శ్రీరామనవమి ఉత్సవాలు రామ మందిరం వద్దకు మారాయి. అంకురార్పణ మాత్రం చిట్టి ఆంజనేయస్వామి గుడిలోనే ఇప్పటికీ జరుగుతున్నాయి. చలువ పందిళ్లలో హరికథ, శాస్త్రీయ నృత్యం, పురాణ ప్రవచనాలు వంటి అనేక సాంస్కృతిక కార్యక్రమాలతో ఇక్కడ జరిగే సీతారామ కళ్యాణం రెండో భద్రాద్రి అన్నంత గుర్తింపును పొందింది. 1984 నుండి సీతారామ కళ్యాణం అనంతరం పందిరి శాంతిగా చిట్టి ఆంజనేయస్వామికి తమలపాకులతో సహస్రనామ పూజ, అప్పాల నివేదన చేసి సహకార బ్యాంక్ వారిచే అన్నదానం జరుగుతోంది. ప్రతి మంగళవారం, శనివారం సామూహిక నాగవల్లీ సహస్రనామ పూజ, గారెల దండ పూజ, వాహన పూజలకు ఈ దేవాలయం ప్రసిద్ధి. తిరుపతి లడ్డూలా ఈ దేవాలయంలో నివేదించే నేతి అప్పం ఈ ప్రాంతంలో విశేషమైంది. ఆలయంలో 40 రోజులు దీక్షగా ప్రదక్షిణలు చేస్తే కోరికలు నెరవేరతాయని భక్తుల నమ్మకం. ప్రభల వేంకటసుబ్బయ్య ఐదో తరానికి చెందిన ప్రభల వాసుదేవ శ్రీకార్తీక్‌శర్మ, శ్రీహర్షశర్మ ధర్మకర్తలుగా వ్యవహరిస్తున్నారు. 1981 నుంచి అర్చకత్వ బాధ్యతలు స్వీకరించిన శ్రీమాన్ అగ్నిహోత్రం నరసింహాచార్యులు ఆధ్వర్యంలో శ్రీసీతారామ మందిరం, దీవి సీతారామాచార్యులు 2015లో పరమపదించిన తర్వాత ఆయన కుమారులైన దీవి యోగానంద చక్రవర్తి, దీవి వేణుమాధవ షణ్ముఖ వర్ధన్‌ల ఆధ్వర్యంలో శ్రీచిట్టి ఆంజనేయస్వామి మందిరం అనుబంధ ఆలయాలుగా భక్తులకు ఆశీస్సులందిస్తున్నాయి. అక్కపెద్ది బాలగోపాల్, కల్లూరి సూర్యనారాయణమూర్తి, పిరాట్ల నారాయణమూర్తి, విష్ణుభట్ల రత్నాకరశాస్త్రి, ప్రభల సూర్యనారాయణమూర్తి వంటి పలువురు వదాన్యులైన భక్తులు సహకరిస్తున్నారు.

విద్యార్థులకు పోషకాహారం అందించాలి



తెనాలిలో మాట్లాడుతున్న ఎంఈవో జయంతిబాబు

కొల్లిపర: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పోషకాహారాన్ని అందించాలని ఎంపీడీవో వి.విష్ణుప్రసాద్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం సభా ప్రాంగణంలో గురువారం ఎంఈవో-1, 2 జి.సాల్మన్‌రాజ్, ఝాన్సీలత ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన నిర్వాహకులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీడీవో విష్ణుప్రసాద్ మాట్లాడుతూ మేలైన కూరగాయలతో వంట చేయాలని సూచించారు. ఎంఈవోలు మాట్లాడుతూ ప్రతిరోజూ మెనూ ప్రకారం ప్రతి పాఠశాలలో నూరుశాతం విద్యార్థులకు మంచి భోజనం అందించాలని తెలిపారు. శిక్షణ అనంతరం మధ్యాహ్న భోజన నిర్వాహకులకు వంటల పోటీలు నిర్వహించి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె.నాగమల్లేశ్వరరావు, కె.బెనహర్ , కె.మల్లేశ్వరరావు , కె.సాయిబాబు, సీఆర్పీ పిడపర్తి రమేష్‌బాబు, పాల్గొన్నారు.

తెనాలి రూరల్‌లో..

స్థానిక రావి సాంబయ్య మున్సిపల్ హైస్కూలులో గురువారం మధ్యాహ్న భోజన పథకం కుక్ కం హెల్పర్ (సీసీహెచ్)లకు ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని విద్యా శాఖ అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ వి. జయంతిబాబు మాట్లాడుతూ ఆరోగ్యకర వాతావరణంలో ప్రతి రోజు మెనూ ప్రకారం పోషక విలువలతో కూడిన భోజనాన్ని విద్యార్థులకు అందించాలని సూచించారు. మరో ఎంఈఓ మేకల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ పోషక విలువలు ఉన్న కోడి గుడ్లు విద్యార్థులంతా తినేలా చూసే బాధ్యత సీసీహెచ్ నిర్వాహకులదేనని తెలిపారు. రిసోర్స్ పర్సన్ శాంతమ్మ మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన శిక్షణలో తాను పాల్గొన్నప్పుడు తెలియజేసిన అంశాల్ని వివరించారు. ప్రతి ఒక్కరూ చేతికి గ్లౌజు, హెడ్ క్యాప్ ధరించి విద్యార్థులకు భోజనం వడ్డించాలని సూచించారు. కార్యక్రమ అనంతరం కుకింగ్ కాంపిటీషన్ నిర్వహించారు. మారిస్‌పేట మున్సిపల్ ప్రైమరీ స్కూల్, జెడ్పీహెచ్ఎస్ కొలకలూరు, ఎరుకలపూడి ప్రైమరీ స్కూల్ మధ్యాహ్న భోజన పథక నిర్వాహకులు బహుమతులు గెలుచుకున్నారు.

హనుమయ్యకు తులసీ దళార్చన



తులసీ దళాలతో స్వామి

తెనాలి రూరల్: పట్టణ మారీసుపేటలోని శ్రీ బాలా త్రిపుర సుందరీ సమేత శ్రీ చంద్రమౌళీశ్వరస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న హనుజ్జయంతి ఉత్సవాల్లో భాగంగా గురువారం స్వామికి తులసీ దళాలతో అర్చన చేశారు. ఆలయ ఆవరణలోని దక్షిణ ముఖ ఆంజనేయుని విగ్రహం వద్ద పూజాది క్రతువుల్ని నిర్వహించారు. ఏర్పాట్లను ఆలయ కమిటీ అధ్యక్షుడు గ్రంధి సేతుమాధవరావు, కార్యదర్శి పొన్నూరు నాగసూర్యశేఖరరావు, కోశాధికారి వరదా వెంకటశేషగిరిరావు పర్యవేక్షించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మహిళలు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు.

మఠం బజారులో..

స్థానిక మారీసుపేట మఠం బజార్‌లోని శ్రీ వీరాంజనేయస్వామి మందిరంలో గురువారం నుంచి హనుజ్జయంతి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు స్వామికి నాగవల్లీ దళార్చన, సిందూరార్చన నిర్వహించారు. శ్రీ వీరాంజనేయస్వామి మందిర కమిటీ సభ్యుల నేతృత్వంలో ఉదయం నుంచి విశేష పూజలు జరిపారు. ఉదయం 7.00 గంటలకు హనుమాన్ చాలీసా పారాయణ చేశారు. పరిసర ప్రాంతాల నుంచి భక్తులు స్వామిని దర్శించుకున్నారు. కాగా శుక్రవారం స్వామికి మల్లెపూలతో విశేష అలంకరణ, శనివారం పంచామృతాభిషేకాలు నిర్వహించనున్నారు.